వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 10
గురువారం, మార్చి 12, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఇరాన్, అమెరికా యుద్ధం.. చమురు నిల్వలు విడుదల చేయాలని జపాన్ కీలక నిర్ణయం

ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఎదుర్కొంటుంది. దీనితో ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్ కీలక నిర్ణయం తీసుకున్నది. తమ వద్ద ఉన్న చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేస్తామని తెలిపింది. మార్చి 16వ తేదీ నాటికి మార్కెట్లోకి తీసుకువస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ ప్రధాని సనయే తకయిచి వెల్లడించారు. మార్చి 16 నుంచి చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేయడం ప్రారంభిస్తామని తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల వేళ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు తమ వద్ద ఉన్న చమురు నిల్వలను విడుదల చేస్తామని అన్నారు. ప్రైవేటు రంగ సంస్థల చమురు నిల్వలను, ప్రభుత్వరంగ చమురు నిల్వలను విడుదల చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. అప్పుడు చమురు లభ్యత పెరిగి ధరల స్థిరీకరణకు దోహదపడుతుందని అన్నారు.

## దీక్ష విరమించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



- వెలుగుమట్ల బాధితులకు ప్రభుత్వం నుంచి హామీ రావడంతో దీక్ష విరమణ
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో దీక్ష విరమించిన కవిత, విశారదన్ మహరాజ్
- నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్

## నేను అసలు కాంగ్రెస్ సభ్యత్వమే తీసుకోలేదు: దానం



- తాను బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ పని చేయలేదన్న దానం
- పార్టీ విప్‌ను కూడా ఉల్లంఘించలేదని వ్యాఖ్య

## బీఆర్ఎస్‌లోనే ఉన్నాం కానీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం: కడియం శ్రీహరి

- స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్
- చట్టబద్ధం కాదన్న శ్రీహరి
- సభలో ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదన్న శ్రీహరి







పర్షియన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై

# ఇరాన్ దాడులు

- దుబాయ్ విమానాశ్రయం, చమురు కేంద్రాలూ లక్ష్యంగా డ్రోన్లు
- ప్రతిగా టెహ్రాన్, అణు కేంద్రాలపై ఇజ్రాయెల్-అమెరికా దాడులు
- గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత.. చమురు ధరలు 200 డాలర్లకు చేరవచ్చన్న హెచ్చరిక
- హోర్ముజ్ జలసంధిలో మందుపాతర్లు.. ప్రపంచానికి ఇంధన ఆందోళన

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇజ్రాయెల్ అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం 12వ రోజుకూ కొనసాగుతుండగా, ఇరువైపులా భారీ దాడులు కొనసాగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పలు వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు దిగింది. యూఏఈ నౌకాశ్రయంలో ఒక కంటైనర్ నౌకపై డ్రోన్ దాడి జరగడంతో అది పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా ఇరాన్ డ్రోన్ దాడులు జరిపింది. రెండు డ్రోన్లు విమానాశ్రయ ప్రాంగణంలో పేలిపోవడంతో ఒక భారతీయునితో సహా నలుగురు గాయపడ్డారు. అయితే విమానాల రాకపోకలు సాధారణంగానే కొనసాగినట్టు అధికారులు తెలిపారు. గల్ఫ్‌లోని చమురు శుద్ధి కేంద్రాలపై కూడా ఇరాన్ ఎడతెరిపి లేకుండా దాడులు కొనసాగించింది. ఇకపై బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సైనిక కమాండ్ ప్రకటించడంతో ఆందోళనలు మరింత పెరిగాయి. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను కువైట్, సౌదీ అరేబియా అడ్డుకున్నట్టు

(మిగతా 2వ పేజీలో)

## జిల్లా కేంద్రాలకు
# రింగురోడ్లు

- సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రధాన పట్టణాల చుట్టూ రింగురోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు
- రింగురోడ్లకు అనుసంధానంగా రేడియల్ రహదారులు
- హైదరాబాద్‌విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేతో నాగార్జునసాగర్ లింక్‌పై అధ్యయనం
- ప్రభుత్వ వాహనాలన్నీ ఇకపై ఎలక్ట్రిక్ వాహనాలే
- శంషాబాద్ సమీపంలో ఆధునిక బస్ టెర్మినల్‌కు ప్రణాళిక



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కొత్త దిశలో చర్యలు చేపడుతోంది. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించి రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు జిల్లా కేంద్రాల చుట్టూ రింగురోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని

(మిగతా 2వ పేజీలో)



## సుసంపన్న తెలంగాణకు కలిసి పయనం

### రాష్ట్ర నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపు

- లోక్‌భవన్‌లో గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం
- హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ చేత ప్రమాణం
- సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్, మంత్రులు పాల్గొన్న కార్యక్రమం
- ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ లక్ష్యాలతో ముందుకు సాగుదాం
- తెలుగులో ప్రమాణ స్వీకారం చేసి ఆకట్టుకున్న గవర్నర్

## వెలుగుమట్లలో 'మోడల్ కాలనీ'గా ఇందిరమ్మ ఇళ్లు



ఖమ్మం: పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి పేదవాడు చట్టబద్ధంగా జీవించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో ఇటీవల కూల్చివేతల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను

(మిగతా 2వ పేజీలో)

- కూల్చివేత బాధితులకు ఇళ్ల స్థలాలు, మంజూరు పత్రాల పంపిణీ
- మౌలిక సదుపాయాలతో ఆధునిక కాలనీ నిర్మాణం
- డిసెంబరు 9న సీఎం చేతుల మీదుగా గృహప్రవేశాలు
- పేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- బాధితులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందన్న మంత్రులు



## అనర్హత పిటిషన్లు కొట్టివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- స్పీకర్‌పై తీవ్ర ఒత్తిడి ఉందని కేటీఆర్ ఆరోపణలు
- ఫిరాయింపుల అంశంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్
- దానం, కడియం వ్యాఖ్యలు హాస్యాస్పదం

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల వ్యవ హారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన బాధ్యుడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ కొట్టివేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ నిర్ణయం వెనుక కాంగ్రెస్ అగ్రనేతల జోక్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మా ట్లాడిన కేటీఆర్, స్పీకర్‌పై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి ఈ తీర్పు ఇప్పించారని

(మిగతా 2వ పేజీలో)

## లోక్‌సభ స్పీకర్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

- రెండ్రోజుల చర్చ అనంతరం మూజువాణి ఓటుతో తిరస్కరణ
- స్పీకర్ తటస్థంగా వ్యవహరించడం లేదని విపక్షాల ఆరోపణ
- సభలో మాట్లాడనివ్వడం లేదన్న రాహుల్ గాంధీ
- సభాపతి చిత్తశుద్ధిపై అనుమానం తగదన్న అమిత్‌షా
- తీవ్ర నినాదాల మధ్య ఉద్రిక్తంగా సాగిన లోక్‌సభ



న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం లోక్‌సభలో వీగిపోయింది. రెండ్రోజుల పాటు జరిగిన చర్చ అనంతరం బుధవారం సాయంత్రం నిర్వహించిన ఓటింగులో మూజువాణి ఓటుతో సభ ఆ తీర్మానాన్ని తిరస్కరించింది. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. సభలో ముఖ్యమైన అంశాలను ప్రస్తావించేందుకు తాము లేచినప్పుడు స్పీకర్ తరచుగా అడ్డుకుంటున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సభలో మాట్లాడే అవకాశాన్ని తరచుగా నిరాకరిస్తున్నారని ఆరోపించారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం, లద్దాఖ్ సంక్షోభం వంటి కీలక అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వలేదని

(మిగతా 2వ పేజీలో)

# 'మిత్రధర్మం పాటించకుంటే పొత్తుకు కట్.. కాంగ్రెస్‌కు కూనంనేని అల్టిమేటం



కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మిత్రధర్మం పాటించడం లేదని, ఇదే ధోరణి కొనసాగితే పొత్తును తెంచుకోవడానికి తాము వెనుకాడబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొత్తగూడెం ఉదంతంతో ఇరు పార్టీల మధ్య దూరం పెరిగిందని, ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే తేల్చుకుంటామని ఆయన ప్రకటించారు.

**మార్చి 24న 'చలో అసెంబ్లీ'.. ప్రభుత్వానికి డిమాండ్లు ఇవే**

రైతుబంధు: రెండు విడతలుగా పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే వేయాలి. ప్రభుత్వం అసలు రైతుబంధు ఇస్తుందో లేదో స్పష్టం చేయాలి.

ఇళ్ల పట్టాలు: హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్చి 24న చలో అసెంబ్లీకి పిలుపు.

సింగరేణి: రాజకీయ జోక్యంతో సింగరేణిని నష్టాల్లోకి నెడుతున్నారని, దీనిపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్.

**ప్రజా పోరాటాల్లో జైలుకైనా సిద్ధం: నారాయణ**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సాగే ఉద్యమాల్లో సీపీఐ ఎప్పుడూ ముందుండాలని పార్టీ సెంట్రల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ పిలుపునిచ్చారు. అవసరమైతే జైళ్లకు వెళ్లడానికి కూడా వెనుకాడకూడదని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఇరాన్‌పై దాడులను మోదీ ప్రభుత్వం ఖండించాలని డిమాండ్ చేయడంతో పాటు, పార్టీ ఫిరాయింపులను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

# జిల్లా కేంద్రాలకు రింగురోడ్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వాహనాలు పట్టణాల్లోకి ప్రవేశించకుండా, సరుకు రవాణా వాహనాలు వేగంగా గమ్యస్థానాలకు చేరుకునేలా ఈ రహదారులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రోడ్లుభవనాల శాఖ, రవాణా శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రాల చుట్టూ ఉన్న ప్రస్తుత రహదారులను అనుసంధానించి రింగురోడ్లుగా అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పట్టణాల నుంచి రింగురోడ్లకు అనుసంధానంగా రేడియల్ రహదారులు నిర్మించాలన్నారు. ఈ రహదారులను సమీపంలోని జాతీయ రహదారులతో అనుసంధానం చేసే అవకాశాలపై కూడా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నుంచి నాగార్జునసాగర్‌కు నేరుగా చేరుకునేలా కొత్త రహదారి నిర్మాణంపై కూడా సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జులు (ఆర్‌ఓబీలు), అండర్‌పాసులు (ఆర్‌యూబీలు) త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన కొత్త వంతెనల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఇక పర్యావరణ పరిరక్షణ దిశగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సీఎం స్పష్టం చేశారు. ఇకపై ప్రభుత్వ అవసరాల కోసం కొనుగోలు చేసే వాహనాలన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే అయి ఉండాలని ఆదేశించారు. 'క్యూర్' పరిధిలో అద్దెకు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే కావాలని సూచించారు. రవాణా శాఖలో అందించే సేవలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. శాఖకు చెందిన కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు లఘు చిత్రాలు రూపొందించి ప్రదర్శించాలని సీఎం సూచించారు. అదేవిధంగా శంషాబాద్ సమీపంలో ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో ఆధునిక బస్ టెర్మినల్ నిర్మించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుందని, సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సుసంపన్న తెలంగాణకు కలిసి పయనం

**రాష్ట్ర నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపు**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అందరం కలిసి ముందుకు సాగాలని రాష్ట్ర నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, భారత రాజ్యాంగ లక్ష్యాలను గౌరవిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తూ సుసంపన్న తెలంగాణ నిర్మాణానికి సహకరిస్తానని పేర్కొన్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో శివప్రతాప్ శుక్లా రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం గవర్నర్‌ను సీఎం, మంత్రివర్గ సభ్యులు అభినందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందేశం విడుదల చేశారు. తెలంగాణ ప్రజలకు సేవ చేయడం తనకు గర్వకారణమని తెలిపారు. సాంస్కృతిక సంపద, సంప్రదాయాలు, అభివృద్ధి లక్ష్యాలతో తెలంగాణ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. ప్రజల పట్టుదల, రాష్ట్రంలోని వనరులు, అభివృద్ధి దృష్టికోణం కలిసి రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అవుతాయని అన్నారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన అనుభవం తెలంగాణకు ఉపయోగపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్రపతి, ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా తన విధులను నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొని గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులతో కలిసి గవర్నర్ గ్రూపు ఫొటో దిగారు.

**తెలుగులో ప్రమాణ స్వీకారం**

ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివప్రతాప్ శుక్లా తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగు భాషతో ముందుగా పరిచయం లేకపోయినా ప్రత్యేకంగా సాధన చేసి తెలుగులో ప్రమాణం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ 'అనే నేను..' అంటూ ప్రమాణాన్ని ప్రారంభించగా, శివప్రతాప్ శుక్లా కూడా పూర్తిగా తెలుగులో ప్రమాణం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.

**భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు**

ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శివప్రతాప్ శుక్లా కుటుంబ సభ్యులతో కలిసి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ట్రస్టీ శశికళ పూర్ణకుంభంతో గవర్నర్‌కు స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆలయ నిర్వాహకులు గవర్నర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

## బీఆర్‌ఎస్‌లోనే ఉన్నాం కానీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం: కడియం శ్రీహరి

**స్పీకర్ క్లీన్-చిట్ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి**

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదన్న శ్రీహరి**

**సభలో ఎప్పుడూ బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదన్న శ్రీహరి**



తాము బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నామని, కానీ ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నామని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు. తమకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తనకు ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని వెల్లడించారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ ప్రజల ముందుకు వచ్చి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడలేదని తెలిపారు. శాసన సభలో మేం ఎప్పుడూ బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నప్పటికీ, నాయకత్వానికి మాత్రమే దూరంగా ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువగా కేసీఆర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫిరాయింపుల విషయంలో గతంలో తప్పు చేశానని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడటంతో పాటు కొందరిని మంత్రులుగా కూడా చేశారని తెలిపారు. తాము పార్టీని ఫిరాయించింది నిజమే అయితే బీఆర్‌ఎస్ పార్టీ తమకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్టీ పరంగా కూడా తమపై ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. మా వేతనం నుంచి ప్రతి నెల రూ.5 వేలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి జమ అవుతున్నాయని వెల్లడించారు.

## నేను అసలు కాంగ్రెస్ సభ్యత్వమే తీసుకోలేదు: కేటీఆర్ వ్యాఖ్యలకు దానం కౌంటర్

**పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో దానంకు క్లీన్ చిట్**

**తాను బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ పని చేయలేదన్న దానం**

**పార్టీ విప్‌ను కూడా ఉల్లంఘించలేదని వ్యాఖ్య**



ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు రాజకీయ దుమారం రేపుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇవ్వడంపై స్పందిస్తూ, తాను ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి పదవి పోయిందని కేసీఆర్ కంటే కేటీఆరే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పదవి తమ ఆస్తి అని కొందరు భ్రమపడుతున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంత ప్రయత్నించినా సీఎంను డీమోరలైజ్ చేయడం వారి వల్ల కాదు" అని దానం ఎద్దేవా చేశారు. అసలు నిన్న జరిగిన బీఆర్‌ఎస్ ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. తాను కేవలం పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేశానని, ఎక్కడా అధికారికంగా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని దానం వెల్లడించారు. శాసనసభలో పార్టీ విప్‌ను ఎప్పుడూ ఉల్లంఘించలేదని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని గుర్తు చేశారు. ఒకవేళ స్పీకర్ తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా, యుద్ధ రంగం నుండి వచ్చిన వాడిలా ఉప ఎన్నికల్లో గెలిచి చూపేవాడినని ధీమా వ్యక్తం చేశారు. తాను సికింద్రాబాద్ ఎంపీగా ఓడిపోవడానికి బీఆర్‌ఎస్, బీజేపీల అపవిత్ర కలయికే కారణమని ఆయన ఆరోపించారు. ఒకవేళ తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్నారు. ఖైరతాబాద్ ప్రజల సైనికుడిగా పనిచేస్తానని, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ ఆశించినట్టే ఫలితాలు ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమే ప్రతిపక్షాలు సీఎంపై బురద చల్లుతున్నాయని మండిపడ్డారు.

## దీక్ష విరమించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**వెలుగుమట్ల బాధితులకు ప్రభుత్వం నుంచి హామీ రావడంతో దీక్ష విరమణ**

**సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో దీక్ష విరమించిన కవిత, విశారదన్ మహారాజ్**

**నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్**



ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిరవధిక దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి వెలుగుమట్ల బాధితులకు హామీ వచ్చిన నేపథ్యంలో ఆమె తన దీక్షను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విరమించారు. కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ కూడా దీక్షను విరమించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఖమ్మంలో సోమవారం రాత్రి నిరవధిక దీక్షను చేపట్టారు. పోలీసులు ఆమెను అడ్డుకుని హైదరాబాద్‌కు తరలించగా, నగరంలో ఆమె దీక్షను కొనసాగించారు. వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పంపిణీ చేశారు. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నామని అన్నారు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచి తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కూడా ధైర్యం చెప్పారు. వెలుగుమట్ల అంశంపై ప్రభుత్వం స్పందించడంతో కవిత దీక్ష విరమించారు. దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తమ పోరాటం ఆగలేదని, కేవలం విరామం మాత్రమే అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. మన ఆందోళనలు, వెలుగుమట్ల ఆడపడుచుల నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చిందని అన్నారు.

## పర్షియన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు

ప్రకటించాయి. ఖతర్, ఒమన్, బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ దాడులు జరిపింది. ఈ పరిస్థితుల్లో యూఏఈలోని రువైస్ చమురు శుద్ధి కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేసినట్టు ప్రకటించారు. మరోవైపు ఇజ్రాయెల్‌లో టెల్ అవీవ్, జెరూసలేం సహా పలు నగరాలపై ఇరాన్ భారీగా క్షిపణులు ప్రయోగించింది. ఇక ప్రతిగా ఇజ్రాయెల్అమెరికా సంయుక్త దాడులు ఇరాన్‌పై కొనసాగుతున్నాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై క్షిపణి దాడులు జరిగాయి. టెహ్రాన్‌లోని బ్యాంక్ సఫా భవనం తీవ్రంగా దెబ్బతిన్నట్టు సమాచారం. లెబనాన్‌లో హెజ్బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. యుద్ధ ప్రభావంతో చమురు సరఫరా దెబ్బతినడంతో అంతర్జాతీయ ఇంధన సంస్థ అత్యవసర నిల్వల నుంచి 40 కోట్ల బ్యారెళ్ల చమురును విడుదల చేయాలని నిర్ణయించింది. మరోవైపు చమురు ధరలు త్వరలో బ్యారెల్‌కు 200 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని ఇరాన్ హెచ్చరించింది. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ మందుపాతర్లు అమర్చుతున్నట్టు సమాచారం రావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లలో ఆందోళనలు మరింత పెరిగాయి.

# దానం, కడియంకు ఊరట

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహీపాల్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మరోవైపు కడియం శ్రీహరి కుమార్తె కావ్య వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. ఆమె తరఫున కడియం శ్రీహరి ప్రచారం చేశారని బీఆర్‌ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం ఈ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ 2024 జూలైలో బీఆర్‌ఎస్ నేతలు శాసనసభ స్పీకర్ వద్ద పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం ఆలస్యమవుతోందని పేర్కొంటూ బీఆర్‌ఎస్ 2024 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని సింగిల్ బెంచ్ స్పీకర్‌ను ఆదేశించింది. అయితే కాల పరిమితి విధించడం తగదని పేర్కొంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. డివిజన్ బెంచ్ తీర్పును రద్దు చేసిన సుప్రీంకోర్టు మూడు నెలల్లో అన్ని పిటిషన్లను పరిష్కరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో 2025 ఆగస్టులో స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి దశలవారీగా విచారణ జరిపారు. అయితే నిర్దేశిత గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టు 2025 నవంబర్ 17న స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. అనంతరం దశలవారీగా పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్ తాజాగా దానం నాగేందర్, కడియం శ్రీహరిపై కూడా అనర్హత వర్తించదని తేల్చి చెప్పారు.

## అనర్హత పిటిషన్లు కొట్టివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం

ఆరోపించారు. రాహుల్‌గాంధీ అనుమతి లేకుండా స్పీకర్ ఇలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదన్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో కాంగ్రెస్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. పార్టీ ఫిరాయింపులు జరిగితే వెంటనే సభ్యత్వం రద్దు చేసేలా చట్టం తెస్తామని చెప్పిన రాహుల్‌గాంధీ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతలను కూడా కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పేదల ఇళ్లను కూల్చివేయడం వెనుక భూ మాఫియా ఉందని ఆరోపించారు. ఈ అంశాన్ని అసెంబ్లీ ఉభయ సభల్లో ప్రస్తావించి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ హాస్యాస్పదంగా పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన గౌరవాన్ని గుర్తుంచుకోవాలని, వారి వ్యాఖ్యలు రాజకీయ నైతికతకు విరుద్ధమని విమర్శించారు.

## లోక్‌సభ స్పీకర్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం ఇచ్చారు. సభాపతి చిత్తశుద్ధిని ప్రశ్నించడం తగదని ఆయన విమర్శించారు. పార్లమెంట్ తన నియమావళి ప్రకారమే నడుస్తుందని, ఏ పార్టీ ఆధారంగా కాదు అని అన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్న ఆరోపణలను కూడా అమిత్‌షా ఖండించారు. కీలక సమావేశాల సమయంలో ఆయన విదేశాలకు వెళ్లిపోతారని, బడ్జెట్ వంటి ముఖ్యమైన చర్చల నుంచి తప్పించుకుంటారని అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్‌కు భాజపాతో పోలిస్తే ఎక్కువ సమయం లభించిందని కూడా వివరించారు. అమిత్‌షా ప్రసంగం సమయంలో విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ సభలో నిరసనలు తెలిపారు. కించపరిచే వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తం మీద తీవ్ర వాగ్వాదాల మధ్య అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో తిరస్కరించబడింది.

# కొల్లూరులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూంలలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమిరెడ్డి ఆధ్వర్యంలో

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు,మహిళ దినోత్సవం వేడుకలు



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి,ఎర్రోళ్ల శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,స్థానిక కార్యకర్తలు.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఇక్కడ ఉన్న సమస్యలను కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 40వేల డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడం జరిగింది. గడచిన 12 సంవత్సరాలు ఒక లెక్క, ఇప్పటినుండి ఒక లెక్క. రెండు సంవత్సరాల కాలంలో అనేక చెప్పారు ముందుకు పోవడం లేదు. ఇక్కడ ఉన్న ఒక్కో ఇల్లు 60 ,70 లక్షల రూపాయలు ఉంటుంది.

మీరు కేసీఆర్ పోటో మీ ఇంట్లో పెట్టుకొని పూజించాలి.

మీ సమస్యలు పరిష్కారం చేస్తాం. కేసీఆర్ అన్ని మతాలను,కులాలను గౌరవించారు. ఎన్నడు చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు కేసీఆర్ చేసి చూపించారు.

ఈ రెండు సంవత్సరాల కాలంలో అభివృద్ధి కోసం నిధుల తేవడానికి చెప్పులు అరిగేలా తిరిగాను. ఇక్కడ సర్వే చేసి మీ ఇండ్లు క్యాన్సల్ చేస్తాం అంటున్నారు అధికారులు.ఎవరి ఇల్లు క్యాన్సల్ చేయకూడదు.అధికారులకు కూడా చెప్తున్న ఎవరివి క్యాన్సల్ చేయకూడదు.

పటాన్చెరు నియోజకవర్గం అంటే మినీ భారత దేశం అన్ని రాష్ట్రాల ప్రజలను గౌరించేది మేము. మా నాయకత్వం మీకు అండగా ఉంటుంది.మీ సమస్యల పరిష్కారం కోసం మన బిఆర్ ఎస్ పార్టీ మీ ముందు ఉంటుంది.

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. ఈరోజు ఇఫ్తార్ విందు లో భాగంగా ఇక్కడకు రావడం జరిగింది. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు భక్తి లతో ఉపవాసం ఉంటారు. తెలంగాణ లో హిందులు, ముస్లిం సోదర భావంతో కలిసి మెలిసి ఉంటారు. ప్రపంచం అంత కూడా ఉద్యమం జరుగుతుంది. ప్రపంచం అంత ఆందోళనలో ఉన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయి. రంజాన్ మాసంలో అల్లా ను వేడుకోండి ఉద్యమం ముగిసిపోవాలని. కేసీఆర్ ప్రతి నియోజకవర్గం లో దావత్ ఏ ఇఫ్తార్ ఇచ్చారు. రంజాన్ తోపా ఇచ్చారు.ఇమాం మౌజంలకు గౌరవ వేతనం ఇచ్చారు.

జూబ్లిహిల్స్ ఎన్నికల సమయంలో ఇక్కడ అంబులెన్స్ లు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఒక్కటి కూడా లేదు. ఇక్కడ ఇవాళ మహిళా దినోత్సవం కూడా జరుపుకుంటున్నాం. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది మన కేసీఆర్ ప్రభుత్వం. పోలీస్ ఉద్యోగాల్లో పురుషులు మాత్రమే ఉండేది కానీ కేసీఆర్ ప్రభుత్వం లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఆడపిల్లకు కోసం మహిళా రెసిడెన్షియల్ స్కూల్ పెట్టారు కేసీఆర్. కళ్యాణ లక్ష్మీ పథకం తెచ్చి ఆసరా అయ్యారు కేసీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం మేము తులం బంగారం ఇస్తాం అన్నారు తులం లేదు పావు లేదు. మళ్ళీ మంచి రోజులు వస్తాయి.

మా అక్క చెల్లెళ్ళకు కోరుతున్న ఇంట్లో ఆడపిల్లను మంచిగా చదివించండి. ఉన్నతమైన చదువులు చదివితే మంచి ఉన్నత స్థానంలో ఉంటారు. మగ పిల్లలకు సమానంగా ఆడపిల్లను చూడాలి. మహిళలు బాగా చదువుకోవాలి,మహిళలు స్వయం సమృద్ధి చెందాలి అని కేసీఆర్ గారు అనేక మహిళ సంక్షేమ పథకాలు అమలు చేశారు.

రాబోయే రోజుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా రిజర్వేషన్లు రాబోతున్నాయి.

కేసీఆర్ శాసన సభలోనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్మానం చేశారు.

మీరు కూడా రాజకీయాల్లోకి రావాలి.

చట్ట సభల్లో సగ భాగం మహిళలు వస్తారు.

కేసీఆర్ 150ఎకరాలు ఇచ్చాడు అని మహిపాల్ అన్న అన్నాడు.కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి అయితే ఉన్నది అమ్మే వాడు అని నేను అన్నాను.

రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క ఇల్లు అయినా కట్టడా

కూల్చుడు తప్ప కట్టుడు లేదు.. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు గుంజుకుంటాడు.

ఫ్యూచర్ సిటీ నీ ఫార్మా సిటీ అని మేము అంటే ఆయన రియల్ ఎస్టేట్ అంటాడు

ముసి అంటాడు పెదోళ్ళ ఇండ్లు కూలగొట్టాడు.

ఖమ్మం లో సైతం 900ఇండ్లు కూలగొట్టాడు.

కూలగొట్టుడు ఎందుకు కట్టుడు ఎందుకు.

ఇండ్లు కులకొడితే వాళ్ళు ఏడిస్తే పోలీసులు కూడా ఏడ్చారు.

బిఆర్ఎస్ పోరాటం చేస్తే ఇప్పుడు మళ్ళీ ఇండ్లు కట్టిస్తాం అంటున్నాడు.

ఏది చెడు భూములు మాత్రమే రేవంత్ రెడ్డి సూత్రం.

పారిశ్రామిక భూముల మీద పడ్డాడు.

కేసీఆర్ ఉంటే ఇచ్చాడు.కానీ రేవంత్ రెడ్డి అయితే అమ్ముకునేవాడు.

దీనికి కూడా 5000కోట్లు వస్తాయని అనుకునేవాడు.

ఇండ్లు కూలగొట్టుడు అయిపోయింది ఇప్పుడు గుడులు కులగొడుతున్నాడు.

శ్యామల దేవి అమ్మవారి ఆలయం కూడా కులకోడుతం అని పోలీసులు కూడా పోయారు.

పొద్దున నేను పోయి ఎట్లా కులకొడుతవు అని నిలదీస్తే ఇక కూలగొట్టను అని వెనుకకు తగ్గాడు

గారిబిళ్ళ ఇండ్లు కూల్చాడు తప్ప తన తమ్ముని ఇల్లు మాత్రం కూలగొట్టలేదు.

మీ దగ్గర ఒక్క రూపాయి తీసుకోకుండా ఇక్కడ ఇల్లు ఇచ్చాడు కేసీఆర్.

శాసన సభలో మీ కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యలు లేవనెత్తుతం

ఎవడు వచ్చి ఇండ్లు గుంజుకుంటాడు సర్వే చేస్తున్నారు అంటే మీరు భయపడకండి మీకు అండగా ఉంటాం.

కేసీఆర్ ఇచ్చిన ఇండ్లు గుంజుకోవడానికి ఎవని హక్కు లేదు.



## నిధుల విడుదలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

### జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

హైదరాబాద్, మార్చి 11: (వాయిస్ టుడే) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల పరిపాలనలో ఎవరెవరికి ఎంత నిధులు ఖర్చు చేశారు పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు రూ.70వేల కోట్లు ఇచ్చి, విద్యార్థుల ఫీజుల కోసం రూ.7వేల కోట్లు ఇవ్వరా అని ప్రశ్నించారు. పీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని నీరుగార్చాలని చూస్తే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. తాము అధికారంలోకి రాగానే ఫీజులకు బకాయిలను విడుదల చేస్తామని, బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులను చెల్లిస్తామని, ఐదు లక్షల రూపాయలతో ప్రతి విద్యార్థికి విద్యార్థి బరోసా కార్డులను అందజేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో భూషణ్ భాస్కర్, పి.కృష్ణ. ముత్యాలరావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్ కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## నందిగామ మదీనా మసీద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : హిందూ ముస్లిం సోదరభావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలోని మదీనా మసీద్‌లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గోరె మియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాట శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షలు విరమించి, వారికి స్వయంగా భోజనం వడ్డించారు. రంజాన్ నెల ప్రేమ, సహనం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పవిత్ర సందర్భాన్ని సామాజిక ఐక్యతకు దోహదపడేలా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నందిగామ గ్రామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, ఉప సర్పంచ్ గోరెమియ మాజీ సర్పంచ్ శివానందం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజు రెడ్డి గోపాల్ శ్రీనివాస్ మరియు కార్యకర్తలు ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




పటాన్ చెరు : ఇఫ్తార్ విందు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్య రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ముస్లిం మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.... పవిత్ర రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సౌహార్దానికి ప్రతీక అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు మరియు పాల్గొన్న ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు ఆదిత్య రెడ్డి మరియు వారి యువసేన సభ్యులు ముస్లిం మైనార్టీ సోదరులు వివిధ సంఘాల యువకులు తదితరులు పాల్గొన్నారు.




## మహిళల భద్రత -- రోడ్డు భద్రతపై అవగాహన రైడ్

శేరిలింగంపల్లి, మార్చి 11 (వాయిస్ టుడే): మహిళల భద్రత మరియు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ మరియు సపోర్టింగ్ హాండ్స్ సంయుక్తంగా మార్చి 14న ప్రత్యేక అవగాహన రైడ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ఐడిఏ లేక్ వద్ద ప్రారంభమై, అరబిందో ఆర్బిట్ భవనం (టీ-హబ్ ఎదురుగా) వద్ద 9 గంటలకు ముగియనుంది. మహిళా రైడర్లు మరియు పిలియన్లు ఈ అవగాహన రైడ్‌లో పాల్గొని మహిళా సాధికారతకు మద్దతు ఇవ్వాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్-2 డీసీపీ ఎస్. శేషాద్రిని రెడ్డి, లా అండ్ ఆర్డర్ డీసీపీ రీతి రాజ్ హాజరై రైడ్‌లో పాల్గొననున్నారు.

అలాగే ప్రత్యేక అతిథిగా భారత తొలి పారా సైక్లిస్ట్ తాన్య దగ పాల్గొననున్నారు. ఆమె ఒక కాలు లేకపోయినా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 2,800 కిలోమీటర్ల సైకిల్ ప్రయాణం పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో జరిగిన వరల్డ్ ఎబిలిటీ గేమ్స్ లో కాంస్య పతకం సాధించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల భద్రతపై అవగాహన పెంచడంతో పాటు రోడ్డు భద్రతా నిబంధనలను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి క్లిన్ చిట్‌పై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, మార్చి 11 (వాయిస్ టుడే న్యూస్): పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ పోగుల తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తరువాత అధికారంలో ఉన్న పార్టీలో చేరడం ప్రజల తీర్పును అవమానించినట్టేనని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన నేపథ్యంలో ఆయనకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినట్టేనని నవీన్ పోగుల వ్యాఖ్యానించారు. అలాగే కడియం శ్రీహరి కూతురు కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు. కడియం శ్రీహరి స్వయంగా కాంగ్రెస్ కండువా వేసుకుని తన కూతురు తరపున ఎన్నికల ప్రచారం చేయడంతో పాటు, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ బీఫామ్‌పై పోటీ చేసిన అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేసిన విషయం ప్రజలు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు. ఇలాంటి స్పష్టమైన పరిస్థితుల్లో కూడా స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య మాత్రమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేసినట్టేనని నవీన్ పోగుల పేర్కొన్నారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయన గౌరవం తగ్గించుకున్నారని కూడా వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగిస్తున్నారనే వాదన ఈ నిర్ణయంతో మరింత బలపడుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలుగా ప్రజల ఓట్లతో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి బహిరంగంగా చేరినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టేనని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే ఈ తీర్పు శాసన వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలుస్తుందని నవీన్ పోగుల పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం ఇస్తారని ఆయన అన్నారు.



## బిషప్ క్రీస్తు రాజు జన్మదినం సందర్భంగా నిమ్స్‌లో ఘనంగా అన్నదానం

### -- 300 మందికి భోజన వితరణ



హైదరాబాద్: మార్చి 11(వాయిస్ టుడే): కింగ్ డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఎన్జీఓ సొసైటీ అధ్యక్షులు బిషప్ క్రీస్తు రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని సొసైటీ ఆధ్వర్యంలో నిమ్స్ హాస్పిటల్ ఆవరణలో సేవా కార్యక్రమంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి భోజనం వడ్డించి మానవతా సేవను చాటుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల బంధువులు, నిరుపేదలు, అవసరమైన వారికి భోజనం అందజేసి సంతోషాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బిషప్ క్రీస్తు రాజు మాట్లాడుతూ సమాజంలో పేదలు, నిరుపేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తమ కింగ్ డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఎన్జీఓ సొసైటీ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా అన్నదానం, పేదలకు సహాయం, విద్యార్థులకు సహాయక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి బంధువులకు ఇలాంటి సమయంలో భోజనం అందించడం ఎంతో ఉపశమనంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సేవ చేయడమే దేవునికి నిజమైన సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి సంతోష్ వర్మ, కోశాధికారి శకుంతల, ఎస్తేర్ రాణి, ఆంథోనీ, డేవిడ్, ప్రభాకర్, సువర్ణ, లక్ష్మీ, భాస్కర్, సన్నీ, అంజనీ, కిరణ్, మేరీ, స్వర్ణ, పద్మ, సాయి, దీపు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్‌కు సత్కారం

హైదరాబాద్,మార్చి 11: (వాయిస్ టుడే): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బర్కత్ పుర ప్రాంతానికి చెందిన ప్రముఖ క్లాసికల్ సింగర్ కుమారి మాళవిక ఆనంద్‌ను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి సతిమణి, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ జి.సరోజ వివేక్ అభినందించి సత్కరించారు. ఆధ్యాత్మిక పాటలతో సంగీత ప్రియులను కట్టిపడేస్తూ దేశ, విదేశాల్లో 700లకు పైగా సాంస్కృతిక ప్రదర్శనల్లో మాళవిక ఆనంద్ పాల్గొన్నారు. 9ఏళ్ల వయసులోనే తెలుగు, హిందీ, కన్నడ, తమిళ్ 17 కీర్తనలతో 'శ్రీహరి సంకీర్తనలు' పేరిట అల్బమ్ రూపొందించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న ఘనత మాళవిక ఆనంద్. 2008 సంవత్సరంలో సీడీని రూపొందించిన నాటి నుంచి నేటి వరకు అనేక భాషల్లో పాటలు పాడి పలు ప్రపంచ రికార్డుల్లో తన పేరును నమోదు చేసుకున్నారు. తన ప్రతిభతో 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ' లో మాళవిక పేరు తెచ్చుకుంది. తన గానామృతంతో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని అందరిచేత ప్రశంసలు అందుకుంటోంది. కార్యక్రమంలో కెఎం భారతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
గురువారం 12 మార్చి 2026

## బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్టుగా మహేష్ నామాని



శేరిలింగంపల్లి, మార్చి 11 (వాయిస్ టుడే): పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులను భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ మరచిపోదని బీజేపీ నేత మహేష్ నామాని అన్నారు. పార్టీ బలోపేతానికి తాను చేసిన సేవలను గుర్తించి తనను బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్టుగా (డిబేట్ అండ్ డిస్కషన్) నియమించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేష్ నామాని మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తాను కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, వివిధ మీడియా వేదికలపై పార్టీ అభిప్రాయాలను బలంగా వినిపించేందుకు తాను మరింత కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తూ, నాయకత్వం ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని మహేష్ నామాని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో, ఉత్సాహంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## స్మశాన వాటికకు అస్తికలు భద్రపరిచే ఆల్మరి అందజేత

### అభినందించిన స్థానికులు,కులపెద్దలు

హనుమకొండ,వాయిస్ టుడే: తమ తండ్రి జ్ఞాపకార్థం చనిపోయిన వారి అస్థికలను భద్రపరిచే అల్మారి ని స్మశానవాటిక కు అందించి తమ గొప్ప మానవత్వం చాటుకున్నారు. హన్మకొండ కాపువాడ వాస్తవ్యులు కీ.శే. దాది సాంబయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు దాది వేణు,దాది వంశీ కాపువాడలోని మున్నూరుకాపు స్మశాన వాటికలో ఆస్తికలను భద్రపరిచేందుకు ఆల్మరిని 24 ర్యాక్ లతో హైదరాబాదులో ప్రత్యేకంగా తయారు చేయించి బుధవారం కాపువాడలోని మున్నూరుకాపు స్మశానవాటిక పెద్దల సమక్షంలో అందించారు. అనంతరం ఆయన కుమారులు మాట్లాడుతూ మున్ముందు కాపువాడలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా కాపువాడ పెద్దలు,ప్రజలు అల్మారి అందించిన దాది సాంబయ్య కుటుంబ సభ్యులను అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.




## జాతీయస్థాయి అవార్డులు అందుకున్న అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

వరంగల్ ( వాయిస్ టుడే) మార్చి 11 : నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ యొక్క ఇద్దరు విద్యార్థులు ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలో జాతీయస్థాయి టాపర్లుగా నిలిచి అవార్డులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య తెలిపారు. ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ ఫౌండర్ అండ్ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ కింగ్ కోఠీలోని భారతీయ విద్యా భవన్ లో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి, జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సినీ హీరో శివ బాలాజీ, అంజలి రాజ్ దాన్, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ శ్రీ పూజ, డా. జీవన్ రెడ్డి, సుహాసిని, కపిల్ దేవ్, విపి పుష్ప, రజని ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ గత నెల (ఫిబ్రవరి 22) హైదరాబాద్ శేర్ లింగంపల్లిలోని అభ్యసన ద స్కూల్ లో జరిగిన జాతీయస్థాయి పోటీ పరీక్షకు 6 విద్యార్థులు హాజరు కాగా గణితం సబ్జెక్ట్ లో నాయిని విజయలక్ష్మి (6వ తరగతి), ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో కొడకండ్ల విరాట్ కుమార్ (3వ తరగతి) లు జాతీయస్థాయిలో టాపర్లుగా నిలిచి అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గాత్ర సంస్కృతిపై గీతం విద్యార్థులకు అవగాహన



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్), హైదరాబాదులోని కళలు, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో బుధవారం గాన సంస్కృతి (వాయిస్ కల్చర్)పై హైబ్రిడ్ విధానంలో కార్యశాల నిర్వహించారు. చెన్నైలోని కే.ఎం. మ్యూజిక్ కన్జర్వేటరీ (ఏ.ఆర్. రెహమాన్ ఫౌండేషన్)లోని హిందూస్థానీ మ్యూజిక్ ఫ్యాకల్టీ డాక్టర్ హంబుల్ షైన్ ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్నారు. దీనిని ఆయన ఆన్ లైన్ లో నిర్వహించి, స్వర శిక్షణ యొక్క శాస్త్రీయ, కళాత్మక అంశాలపై విలువైన అంతర్దృష్టులను విద్యార్థులకు అందించారు.

ఒక గాయకుడు తమ గొంతును ఉపయోగించే వివిధ స్థాయిలు లేదా శ్రేణులు (రేంజెస్) గొంతు కదలికలు, నాణ్యతలో మార్పులను బట్టి మారతాయని హంబుల్ షైన్ చెప్పారు. ఛాతీ స్వరం (ఛెస్ట్ వాయిస్) తక్కువ స్థాయి స్వరాలు, మధ్యమ స్థాయి, హెచ్చు స్థాయి స్వరాలు (హెడ్ వాయిస్), సాధారణ స్వరాలు (ఫాల్సెట్టో), అత్యంత హెచ్చు స్వరస్థాయి లేదా ఈల వంటి ధ్వని (విజిల్ రిజిస్టర్)లతో సహా వివిధ స్వర స్థాయిల గురించి ఆయన వివరించారు. గాయకులు రాగాలను తగిన స్వర శ్రేణిలో ఎలా సమర్థవంతంగా పాడగలరో తెలుపుతూ, అదే సమయంలో స్వరంలో హెచ్చుతగ్గులు (మాడ్యులేషన్), స్వరాన్ని స్పష్టంగా లేదా దూరం వరకు వినిపించేలా (ప్రొజెక్షన్) చేసే నియంత్రణా పద్ధతులను కూడా ప్రదర్శించారు.


ఈ కార్యశాలలో సందర్భాను సారం శైలి (రిజిస్టర్ బ్లెండ్), రెండు అచ్చులు కలిసి ఒకే శబ్దాన్ని పలికే విధానం (వోవల్ బ్లెండ్) వంటి స్వర మిశ్రమ పద్ధతులను కూడా వివరించారు. ఇవి గానంలో శబ్ద సమతుల్యత (టోనల్ బ్యాలెన్స్), సున్నితమైన పరివర్తనలను సాధించడానికి అవసరమన్నారు. సాంకేతిక అంశాలతో పాటు, గానం యొక్క మానసిక కోణాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. గాత్ర ప్రదర్శనలో మానసిక సంసిద్ధత, నిరీక్షణ, ఏకాగ్రత, భావోద్వేగ సంబంధం యొక్క ప్రాముఖ్యతలను విశదీకరించారు. ఈ కార్యశాల చివర్లో విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవడానికి ప్రోత్సహించారు. ఆయన చేసిన ఆచరణాత్మక సూచనలు, ప్రభావవంతమైన స్వర స్థాయిల యొక్క సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడింది. ఈ కార్యశాలను లలిత, ప్రదర్శన కళల విభాగ అధ్యాపకులు ఆనందు మురళి, దర్భా మృదురవళి నిర్వహించి, సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు వృత్తిపరమైన గాత్ర శిక్షణ పద్ధతులకు విలువైన అవగాహనను అందించడమే గాక, సంగీత ప్రదర్శనలో గాత్ర సంస్కృతిపై వారి అవగాహనను పెంచింది.



# రంజాన్ ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్



హైదరాబాద్, మార్చి 11 (వాయిస్ టుడే): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదర సోదరీమణులకు అత్యంత పవిత్రమైనదని తెలిపారు. ఈ నెలలో ఉపవాస దీక్షల ద్వారా మనిషి సహనం, నియమం, సేవాభావం మరియు మానవత్వం వంటి గొప్ప విలువలను ఆచరిస్తాడని పేర్కొన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన దేశమని, అన్ని మతాలు, అన్ని సంస్కృతులను సమానంగా గౌరవించడం భారతదేశపు గొప్ప సంప్రదాయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో సెక్యులర్ విలువలను కాపాడుతూ అన్ని మతాల ప్రజలను సమానంగా గౌరవించే విధానాన్ని అనుసరిస్తోందని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మిద్దెల జితేందర్ పేర్కొన్నారు. ఈ పవిత్ర రంజాన్ మాసం దేశంలో శాంతి, సామరస్యం మరియు సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ వాజిద్, మైక్, ప్రధాన కార్యదర్శి బండి సురేందర్, శంకర్‌తో పాటు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.




# రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలోకి వెళ్తా..

**మా రాజీనామాల గురించి మాట్లాడే అర్హత లేదు**

**స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నా..**
**అనర్హత పిటిషన్‌కు అర్హత లేదు**

**పార్టీ ఫిరాయింపులకు**
**పాత్రదారులు,సూత్రదారులు కేసీఆర్**

**సుద్దపూస లెక్క మాట్లాడుతున్న కేటీఆర్**



హనుమకొండ,వాయిస్ టుడే: తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించాను, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి తప్పు చేశానని కేసీఆర్ స్వయంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబితే ఆ మరుక్షణమే రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలోకి వెళ్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. అలా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పే ధైర్యం కేసీఆర్ కు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే మా రాజీనామాల గురించి మాట్లాడే అర్హత మీకు లేదని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై దాఖలైన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల పిటిషన్ లు చట్ట బద్దం కావని,అసలు అనర్హత పిటిషన్ కు అర్హత లేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నియామవళి ప్రకారం పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే ఆ సభ్యునికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని అన్నారు. అలా నాకు ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వలేదని, వివరణ తీసుకోలేదని తెలిపారు. పార్టీ విప్ ఏనాడూ దిక్కరించలేదని వెల్లడించారు. కేసీఆర్ ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపుల పై మాట్లాడలేదని,పార్టీ పరంగా కేసీఆర్ ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. శాసనసభా సమావేశాలలో కేటీఆర్ మా సభ్యుల సంఖ్య 38 అందుకు తగ్గట్లుగా మాకు సమయం ఇవ్వండని స్పీకర్ ను అడిగినట్లు తెలిపారు. మాపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చి బిఆర్ఎస్ ఎల్ పికి నెలకు 5వేల రూపాయలను మా జీతం నుండి సభ్యత్వ రుసుము తీసుకుంటున్నారని తెలిపారు. 2014 నుండి 2023వరకు కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో ఎన్ని రాజకీయ పార్టీల నుండి ఎంత మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు పార్టీ ఫిరాయింపులకు పాత్రదారులు, సూత్రదారులు కేసీఆర్ అని అన్నారు. 36మంది ఎమ్మెల్యేలను చేర్చుకొని పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడమే కాకుండా పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలను మంత్రులను చేసిన చరిత్ర మీదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీలు ఉండకూడదని శాసనసభా పక్షాలను సైతం పార్టీలో విలీనం చేసుకున్నారని విమర్శించారు. అయినా కేటీఆర్ సుద్దపూస లెక్క మాట్లాడుతున్నాడని ఏద్దేవా చేశారు. ఆనాడు మీరు చేసింది తప్పని భావిస్తే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆరే స్వయంగా నేను చేసింది తప్పు,తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించాను అని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అలా చెప్పిన మరుక్షణమే నేను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అలా చెప్పే దమ్ము కేసీఆర్ కు ఉందా అని ప్రశ్నించారు. ఒకవేళ అలా చెప్పలేక పోతే మా రాజీనామా ల గురించి మాట్లాడే అర్హత మీకు లేదని స్పష్టం చేశారు.


# కుత్బుల్లాపూర్ డివిజన్ సమాధుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

## - డిప్యూటీ కమిషనర్‌కు నల్ల జై శంకర్ గౌడ్ వినతి

కుత్బుల్లాపూర్ మార్చ్ 11(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ డివిజన్ 286 పరిధిలోని సమాధుల ప్రాంగణాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈరోజు నల్ల జై శంకర్ గౌడ్ జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పులి బాలరాం మరియు కేశవ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సమాధుల ప్రాంగణాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై ఉన్నాయని తెలిపారు. అక్కడ సరైన పరిశుభ్రత లేకపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా సమాధుల వద్ద ఉన్న వాష్‌రూమ్‌లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉండి ప్రజలు ఉపయోగించుకోలేని స్థితిలో ఉన్నాయని, తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ ప్రస్తుతం పనిచేయకపోవడంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రియమైన వారి అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సమాధుల ప్రాంగణాలు గౌరవప్రదమైన ప్రదేశాలు కావడంతో అక్కడ కనీస పౌర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సమాధుల వద్ద బోర్‌వెల్‌ను మరమ్మత్తు చేసి తాగునీటి సౌకర్యం కల్పించడం, వాష్‌రూమ్‌లను పునరుద్ధరించడం, సమాధుల ప్రాంగణంలో క్రమం తప్పకుండా పరిశుభ్రత నిర్వహించడం, మొక్కలు నాటడం వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల కార్యక్రమం కింద ఈ పనులను వెంటనే ప్రారంభించి టెండర్లు పిలిచి త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పులి బాలరాం, ప్రముఖ న్యాయవాది కేశవ్ తదితరులు పాల్గొన్నారు.





## పదవ తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

### ఉన్నత మార్కులు సాధించిన వారికి బహుమతులు: బొబ్బ నవత రెడ్డి

శేరిలింగంపల్లి, మార్చి 11(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ పరిధిలో ఉన్న వేముకుంట ఉర్దూ మీడియం పాఠశాలలో బుధవారం పదవ తరగతి పరీక్షలకు హాజరుకాబోతున్న విద్యార్థులకు స్టేషనరీ ఐటమ్స్‌ను పంపిణీ చేశారు. బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, స్కేలు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. శేరిలింగంపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.డి. గౌస్, ప్రకాష్, చంద్రరావు, అనంతరెడ్డి, షబానా, బాబా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ మార్చ్ 11(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మర్యాద పూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.



## పలువురి ఆహ్వాన పత్రికలు మరియు వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మార్చ్ 11(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ నివాసం ( షాపూర్ నగర్) లో వివిధ సమస్యలపై వచ్చిన స్థానిక నియోజకవర్గ ప్రజల నుండి వారి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు.మరికొన్నిటిని జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబు దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారుఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో ఎల్ఎస్డీ డ్రగ్స్ పెడ్లర్‌తో పాటు కస్టమర్ అరెస్ట్.. కారు, స్కూటీ, మొబైల్ ఫోన్లు స్వాధీనం



శేరిలింగంపల్లి, మార్చి 11(వాయిస్ టుడే): గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్ఎస్డీ స్టాంప్ పేపర్ల విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడిగా ఠాకూర్ సూరజ్ సింగ్ (26)ను గుర్తించారు. అతను కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి నగర్, మై హోమ్ మంగళ అపార్ట్మెంట్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, సూరజ్ సింగ్ గోవా నుంచి ఎల్ఎస్డీ స్టాంప్ పేపర్లు తెచ్చి హైదరాబాద్‌లో ఒక్కో పేపర్‌ను రూ.3,000కు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు నిఘా పెట్టి సూరజ్ సింగ్‌తో పాటు కస్టమర్ గోపిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక కారు, స్కూటీ, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులు తెలిపారు.

## అర్థం లేని యుద్ధం

### రాహుల్ కంటే యూత్ పార్లమెంట్ సభ్యులకే ప్రజా సమస్యలపై అవగాహన ఉంది: కేటీఆర్

మెహిదీపట్నం: ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కంటే కళాశాలలో యూత్ పార్లమెంట్ సభ్యులుగా ఉన్న విద్యార్థినులకే ప్రజా సమస్యలపై ఎక్కువ అవగాహన ఉందని మాజీ మంత్రి, భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం జరిగిన మాక్ యూత్ పార్లమెంట్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా అధికార, ప్రతిపక్ష సభ్యులుగా ఉన్న విద్యార్థినుల మధ్య వివిధ జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చ జరిగింది. ఈ మాక్ పార్లమెంట్‌ను కేటీఆర్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో బలమైందని, పోలింగ్ రోజు ఎక్కువ శాతం ప్రజలు హాలిడే మూడ్‌లో ఉంటారన్నారు. యువత విధిగా ఓటింగ్‌లో పాల్గొని, సమర్థులైన ప్రజాప్రతినిధులను చట్టసభలకు పంపించాలన్నారు. మహిళలు బేబీ మేకింగ్ మిషన్లుగా మారవద్దని, స్వశక్తితో ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగిన తర్వాత వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని కేటీఆర్ సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం మైండ్‌లెస్‌గా ఆయన అభివర్ణించారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ విజయారాణి, కరెస్పాండెంట్ సిస్టర్ మరియా రాణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిధుల దుర్వినియోగంపై ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన




శేరిలింగంపల్లి, మార్చి 11(వాయిస్ టుడే): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ పథకం కింద కేటాయించిన నిధుల దుర్వినియోగంపై ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆందోళన చేపట్టింది. యూనివర్సిటీ పరిపాలనపై తీవ్ర ఆరోపణలు చేస్తూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం యూనివర్సిటీకి మొత్తం 710.5 కోట్లు నిధులు అందగా, అందులో కేవలం ?3.57 కోట్లు (సుమారు 0.5 శాతం) మాత్రమే విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు విద్యార్థి సంఘం ఆరోపించింది. మిగతా నిధుల వినియోగంపై స్పష్టత లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఐఓఈ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏబీవీపీ విద్యార్థులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ దీనికి బాధ్యత వహించాలని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించి, యూనివర్సిటీలో అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని విద్యార్థులు యాజమాన్యాన్ని కోరారు.

## ఉప్పల్ ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిజం ప్రతినిధులు

### రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లా సంతోష్ కుమార్



నాచారం (వాయిస్ టుడే):తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిజం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లా సంతోష్ కుమార్ మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకట్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీ అయి ఉప్పల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎల్లా సంతోష్ కుమార్ ఉప్పల్ పరిధిలో ఉన్న పలు సమస్యలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిత్యం జరుగుతున్న అన్యాయాల గురించి ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన అంశాలు, ప్రజలకు న్యాయం జరిగేలా సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల బాధ్యత అని తెలిపారు. పోలీస్ శాఖతో జర్నలిస్టుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బొడ్డు శివ న్యూస్ రిపోర్టర్లు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్ మార్చ్ 11(వాయిస్ టుడే ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణేష్ నగర్ పరిధిలోని పద్మనగర్ ఫేస్ -1, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అకోడే. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు, వారి సమక్షంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హన్మంత్ రెడ్డి చేతులమిడదిగా జిహెచ్ఎంసి కార్మికులకు చీరలు పంపిణి చేసారు .ఈ కార్యక్రమంలో డీసీసీ మహిళ అధ్యక్షురాలు రాజనోల లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ కె .ఎమ్ గౌరీష్, డివిజన్ అధ్యక్షులు ఎండి .జాకీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, మన్నే రాజు, బేకు శ్రీనివాస్, బుయ్యని శివ కుమార్, కయ్యుమ్, జెస్సి పాల్, ప్రదీప్, కుమార్, ప్రవీణ్, సురేందర్, రమేష్, అక్బర్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సుజాత, సుజాత యాదవ్, అరుణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల భూదాన్ భూమి బాధితులకు తక్షణ న్యాయం చేయాలి

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం

ఖమ్మం, మార్చి 11 (వాయిస్ టుడే) : ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూముల సమస్యతో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. భూదాన్ భూమి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొంటున్న కల్వకుంట్ల కవిత గారికి సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, ఖమ్మం పట్టణానికి సమీపంలోని వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న భూదాన్ భూముల్లో సుమారు 600 కుటుంబాలు సంవత్సరాలుగా నివసిస్తూ తమ కష్టార్జిత ధనంతో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. భూములపై స్పష్టమైన పరిష్కారం ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులు సమస్యను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

భూదాన్ ఉద్యమం ద్వారా పేదలకు ఇవ్వాల్సిన భూములు పేదల జీవనాధారంగా మారాల్సింది పోయి, రికార్డుల గందరగోళం మరియు అధికారుల నిర్లక్ష్యంతో వివాదాల కేంద్రంగా మారడం విచారకరమని పేర్కొన్నారు. భూముల విలువలు పెరిగిన తరువాత మాత్రమే ప్రభుత్వం అక్రమ



ఆక్రమణల పేరుతో చర్యలు తీసుకోవడం ప్రజలలో అనుమానాలు రేకెత్తిస్తున్నదని ఆయన అన్నారు. ఇటీవల నిర్వహించిన భారీ ఎత్తున కూల్చివేత చర్యల వల్ల సుమారు 600 కుటుంబాలు, దాదాపు 3000 మంది ప్రజలు ఒక్కసారిగా గూడు కోల్పోయి రోడ్డునపడ్డారని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జీవితకాల పొదుపులతో నిర్మించిన ఇళ్లు ఒక్కరోజులో కూల్చివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ముందస్తు పునరావాసం కల్పించకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాన్ని సూచిస్తుందని విమర్శించారు.

ప్రభుత్వం తర్వాత సర్వేలు చేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించడం సరిపోదని, ముందుగా బాధిత కుటుంబాలకు తక్షణ పునరావాసం కల్పించి, భూదాన్ భూములపై స్పష్టమైన విధానం ప్రకటించాలని సత్యం డిమాండ్ చేశారు. మధ్యవర్తుల మోసాలకు గురైన పేదలపై చర్యలు కాకుండా, అలాంటి అక్రమాల వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెలుగుమట్ల ఘటన తెలంగాణలో భూసంబంధిత పరిపాలనలో ఉన్న లోపాలను బయటపెట్టిందని ఆయన పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన కోరారు. భూమి కోసం పోరాడుతున్న వెలుగుమట్ల బాధిత కుటుంబాలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ప్రభుత్వం బాధితుల సమస్యలను సానుభూతితో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జనగణన పకడ్బందీగా పూర్తి చేయాలి

ప్రతి ప్రభుత్వ పథకానికి ఈ గణన కీలకం.

రెండు దశల్లో జనగణన.

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

జనగణన 2027 పై చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం



రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 11( వాయిస్ టుడే) జనగణన - 2027 ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027 పై సెన్సెస్ ఫర్ వెల్ఫేర్ పేరిట ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయం లో చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లుకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హాజరై మాట్లాడారు. సెన్సెస్ చట్టం 1948 రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వం జన గణన చేపడుతుందని తెలిపారు. చార్జ్ ఆఫీసర్లు గా మున్సిపాలిటీ లో కమిషనర్లు, మండలాల్లో తహసీల్దార్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లుగా ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉంటారని వెల్లడించారు. ఎన్యూమరేషన్ బ్లాక్ లో దాదాపు 700 నుంచి 800 మంది ప్రజలు ఉంటారని తెలిపారు. ఎన్యూమరేటర్, సూపర్ వైజర్లుగా,ఉపాధ్యాయుల ను నియమించాలని సూచించారు. ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక టెక్నికల్ సహాయకులు ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొట్ట మొదటి స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అని వివరించారు. ఈ విధానంలో ప్రజలే తమ వివరాలు పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన గణన అధికారిగా కలెక్టర్, జిల్లా అదనపు గణన అధికారిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గణన అధికారిగా శ్రీనివాసాచారి ఉంటారని తెలిపారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం జనగణన అనేది చాలా కీలకమైన అంశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనగణన చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరోగ్య, అక్షరాస్యత, జనాభా, లింగ నిష్పత్తి, వలసలు, ఉపాధి నివాస స్థితి తదితర అంశాల వివరాలు జనగణనతో ప్రభుత్వం వద్ద ఉంటాయని వెల్లడించారు. దీంతో ప్రతి ప్రభుత్వ పనికి సంబంధించి ఈ వివరాలు కీలకమని స్పష్టం చేశారు. జనగణనలో పాల్గొని అధికారులు బాధ్యతాయుతంగా తమ కేటాయించిన విధులను నిర్వర్తించాలని, వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. రోజువారి ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, సుమిత్ర హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు

– హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

ముస్లిం సోదరులందరికీ రంజాన్ పవిత్ర మాస శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ మరియు పట్టణ సి ఐ

జమ్మికుంట మార్చి 11 (వాయిస్ టుడే) : జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయం (టి డబ్ల్యు జే ఎఫ్) లో ముస్లిం సోదరుల పవిత్ర రంజన్ మాస ఉపవాస దీక్ష సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు సొడమల్ల యోహన్ ఆధ్వర్యంలో ముస్లిం పాత్రికేయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్, పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ హాజరై వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. రంజాన్ మాసంలో సూర్యాస్తమయం తర్వాత ముస్లింలు తమ రోజా (ఉపవాసం) విరమించే భోజనాన్ని “ఇఫ్తార్” అని పిలుస్తారు, ఇది రోజంతా ఆకలి, దప్పులతో గడిపిన తర్వాత తీసుకునే ప్రధాన ఆహారం. సాధారణంగా ఖర్జూరాలు, నీటితో ఉపవాసం మొదలుపెట్టి, కుటుంబం, బంధు మిత్రులతో కలిసి ఇఫ్తార్‌ను ఆనందంగా జరుపుకుంటారు. ఈ రంజన్ మాసం మొత్తం రోజా ఉండే ముస్లిం సోదర,సోదరీమణులను ఆ అల్లా చల్లగా చూడాలని మరియు జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యు ఎఫ్ జిల్లా కార్యదర్శి కుడతాడి బాపూరావు, జిల్లా నాయకులు ఖాజా ఖాన్, హుజురాబాద్ నియోజకవర్గం కార్యదర్శులు, ఏబూసి సంపత్, భూపతి సంతోష్, ఆరికెల్ల భానుచందర్, దొడ్డె రాజేంద్రప్రసాద్, కందుకూరి రాజు, బడుగు రవికుమార్, ఎమ్ ఏ రషీద్, రచ్చ రవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఫుట్ పాత్ ను ఆక్రమించి నిర్మాణాలు చోద్యం చూస్తున్న అధికారులు

నూతనంగా నిర్మించే బహుళ అంతస్తులకు పార్కింగ్,సెట్ బ్యాక్ లేకున్నా అనుమతులు

కరీంనగర్, మార్చి 11(వాయిస్ టుడే): నగరంలో భవన యజమానులు నిబంధనలు విస్మరించి పుట్ పాత్‌లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ అధికారుల నిర్లక్షం, అలసత్వంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నా అధికారులు కానీ,ప్రజా ప్రతినిధులు కానీ పట్టించు కోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చిరు వ్యాపారులు జీవనోపాధి కోసం తోపుడు బళ్ళు రోడ్డు ప్రక్కన పెట్టి విక్రయాలు జరుపుతే వెంటనే అధికారులు జరిమానాలు విధిస్తూ,వారి జీవనోపాధిని జప్తు చేసే అధికారులకు భవన యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణాలు చేపట్టిన కనీసం అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు విస్మయం చెందుతున్నారు. నూతనంగా నిర్మించే బహుళ అంతస్తులకు పార్కింగ్ స్థలాలు లేకున్నా,సెట్ బ్యాక్ లేకున్నా, అత్యవసర పరిస్థితుల్లో అనుకోని సంఘటనలు జరిగితే ఫైర్ ఇంజిన్ తిరిగేలా బహుళ అంతస్తు భవనాల చుట్టూ కనీసం 3 మీటర్ల కాలి స్థలం ఉండాలనే నిబంధన పాటించకున్నా అధికారుల సమన్వయ లోపంతో భవన యజమానులు దర్జాగా నిర్మాణాలు చేపట్టిన అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నగరంలో పర్యటించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవన యజములపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వ్ పాత్ర కీలకం : జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి.

ఫైరింగ్, రాత పరీక్ష లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంశలు.



రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 11 (వాయిస్ టుడే) జిల్లా లో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అభినందించారు. సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు ఎస్పి పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబపరమైన, శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు.

అంతకుముందు వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న, అధికారులకు సిబ్బందికి సర్దాపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఇచ్చే ఫైరింగ్ శిక్షణను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగింది.ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు.1st బి. శ్రీనివాస్,2అం జి. వెంకటేష్,3తీం ఏ. ప్రియాంక,రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు;1st మనోజ్ కుమార్,2అం బి. శ్రీనివాస్,3తీం డి. ప్రియాంక,ఈ కార్యక్రమం లో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



## స్వప్న స్వదేశ్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

బోయినపల్లి మార్చి 11 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినపల్లి మండలం రామన్నపేట గ్రామం లో స్వప్న స్వదేశ్ స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. దీనిలో భాగంగా మొదటి బ్యాచ్ లో 20 మంది మహిళలకు టైలరింగ్ లో ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ స్వప్నరావు తెలిపారు.ఈ కార్యక్రమం లో రామన్నపేట గ్రామ సర్పంచ్ కవిత వెంకట్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగని అశోక్, వర్ధవెల్లి సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్బంగా వివిధ గ్రామాల సర్పంచ్ లు మాట్లాడుతూ గ్రామీణ మహిళల కోసం ఉచిత శిక్షణ అందిస్తున్న సంస్థ నిర్వాహకురాలు స్వప్నరావు ని అభినందిస్తూ ఈ మంచి అవకాశాన్ని మహిళ లు ఉపయోగించుకోవాలని కోరడం జరిగింది.ఈ సందర్బంగా శిక్షణ తీసుకోబోతున్న మహిళల కు యూనిఫామ్, టూల్ కిట్లు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి తో పాటు మాజీ ఉప సర్పంచ్ లు రాములు, భూమయ్య, సుధాకర్ రెడ్డి, అనీల్ రెడ్డి, మెరుపుల మహేష్, సతీష్, వేణు, కె మహేష్,కిషన్, నాగార్జున్,సురేష్, శ్రీను, అనీల్ మరియు సంస్థ వాలంటీర్ లు పాల్గొనడం జరిగింది.



## వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్

వేములవాడ, మార్చి 11(వాయిస్ టుడే) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో బుధవారం రోజు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఇందులో ఆసుపత్రి సిబ్బంది నర్సింగ్ ఆఫీసర్స్ హెడ్ నర్సెస్ నర్సింగ్ సూపరిండెంట్లతో పాటు వైద్యులు డా రవీందర్, డా.పెంచలయ్య , డా.చారి, డా రాజశ్రీ, డా.తిరుపతి తదితరులు పాల్గొని ఆసుపత్రి ఆవరణను, ఆసుపత్రి లోపల వార్డులను శుభ్ర పరిచారు. ఆసుపత్రి కి వచ్చే రోగులకు వారి సహాయకులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత గురించి పలు సూచనలు చేశారు.

## అంతరాష్ట్ర దొంగల ముఠా సంచారం - ప్రజలు అప్రమత్తంగా ఉండండి: పట్టణ సి ఐ రామకృష్ణ గౌడ్



జమ్మికుంట మార్చి 11 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణ పోలీస్ శాఖ గ్రామ ప్రజలకు అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం, మెట్టుపల్లి గ్రామంలో తేదీ 10-03-26 రాత్రి అంతరాష్ట్ర దొంగల గ్యాంగ్ ద్వారా చోరీ జరిగింది. ఈ దొంగలు పరిసర మండలాల గ్రామాల్లో కూడా మళ్లీ చోరీలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉంది. అందువల్ల గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు. జాగ్రత్తలు: రాత్రి సమయంలో ఇళ్ల తలుపులు, కిటికీలు బాగా లాక్ చేసుకోవాలి. ఇళ్లను ఎక్కువ రోజుల పాటు ఖాళీగా వదిలి వెళ్లకండి. రాత్రి లేదా పగలు సమయంలో అనుమానాస్పద వ్యక్తులు / వాహనాలు కనిపిస్తే వెంటనే 100 కు కాల్ చేయండి. గ్రామంలో కొత్తగా తిరిగే వ్యక్తులపై జాగ్రత్తగా గమనించండి. మీ గ్రామాల్లో లేదా శివారులో కొత్తగా గుడారాలు వేసుకొని నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వ్యక్తులు ఉంటే వారి వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయండి. మీ విలువైన నగలను భద్రంగా భద్రపరచుకోవాలి. గ్రామ భద్రత కోసం పక్కింటివారితో పరస్పరం సమాచారం పంచుకోవాలి. గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలి అన్నారు.



## మార్చి 15న హమాలి మహాగర్జనను జయప్రదం చేయాలి: రాష్ట్ర కార్మిక నాయకులు

సిరిసిల్ల, మార్చి 11 (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్రం లో 10 లక్షల మందికి పైగా హమాలి కార్మికులు పనిచేస్తున్నారు. లోడింగ్ అన్ లోడింగ్ శ్రమ దోపిడి చేస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ లో హమాలీల కీలకపాత్ర పోషిస్తున్నారు. మార్కెట్ యార్డులు, గోదాములు, సిమెంట్ గోదాం,లో ధాన్యం సేకరణ కేంద్రాలు, వ్యాపార స్థలాల,లో కార్మికులు పని చేస్తున్న, అంత శ్రమిస్తున్న హమాలి కార్మికుల జీవితాల లో మెరుగుదల లేకపోవడం, హమాలి కార్మికులకుల కుటుంబాలు చిన్న వయసు లోనే తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం హమాలీ కార్మిక గురించి పట్టించుకోనా పాపను పోలేదు. హమాలి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం. కూడా అమలు కాలేదు. ఇతర రాష్ట్రాల నుండి కార్మికులు రావడం వలన మొత్తం హమాలి కార్మికుల పోటీ పెరిగింది. హమాలి కార్మికులకు అందే వేతనాలు మరింత గా పడిపోయే పరిస్థితి ఏర్పడ్డది, ఇప్పుడున్న ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని విశ్వాసం తో, కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవడానికి తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ అనేక రూపాలలో కృషిచేసినది. మన యూనియన్ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి మన సమస్యల ను ప్రజా ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి, కాంగ్రెస్ పార్టీ అమాలి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా, రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయడానికి మార్చి15 న నిర్వహించబోయే హమాలీ మహా గర్జన ను హనుమకొండ, వరంగల్ పట్టణం లో నిర్వహించబోయే సభ ను హమాలి కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నాం. అన్నాడి వెంకట్ రెడ్డి, తెలంగాణ కార్మికుల వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ, జంగా సంపత్ యాదవ్ పెద్దపల్లి జిల్లా బాధ్యులు, కామ భూమయ్య పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి, కొమ్ము మధుకర్ కరీంనగర్ జిల్లా బాధ్యులు, ఎడ్ల విశాన్ సిరిసిల్ల జిల్లా బాధ్యులు, నగునూరి భాను సిరిసిల్ల హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు, కులిపురం రమేష్ ఉపాధ్యక్షులు, గడ్డి దేవయ్య కోశాధికారి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం 12 మార్చి 2026



## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ని కలిసిన ఎల్లారెడ్డిపేట సీఐ ఓదెల.వెంకటేష్

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట సర్కిల్ కొత్త ఇన్స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన ఓ.వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ని బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మర్యాద పూర్వకం గా కలిసి పూల మొక్కను అందజేశారు.



## కరీంనగర్ డంపింగ్ యార్డును తరలించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ : డంపింగ్ యార్డు వల్ల కరీంనగర్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడంతో కరీంనగర్ పట్టణ ప్రజల ఇబ్బందులు పడుతున్న దృశ్య చొప్పదండి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ డంపింగ్ యార్డు తరలిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి డంప్ యార్డును సందర్శించారు.ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కరీంనగర్ డంపింగ్ యార్డు శాశ్వతంగా తరలించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని త్వరలోనే తరలింపుకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కార్పొరేటర్ అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్‌గా బర్ల సునీత



కాజీపేట,వాయిస్ టుడే: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గా కాజీపేట బాపూజీనగర్ కు చెందిన బర్ల సునీత ఎన్నికయ్యారు. సునీత గతంలో రంగారెడ్డి జిల్లా ఫోక్సో కోర్టులో పి.పి గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ తాను గత 15 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నానని అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికైన సందర్భంగా న్యాయవాదుల హక్కుల సాధనకై వారి పక్షాన నిలిచి పోరాడుతానని,న్యాయవాదుల సంక్షేమం కోసం కృషిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బార్ కౌన్సిల్ మెంబర్ గా గెలిపించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు బర్ల సునీత తెలియజేశారు.

## మహిళలు నిర్ణయాత్మకశక్తిగా మారాలి



తొర్రూరు, మార్చి 11 వాయిస్ టుడే : మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సూర్ణం రామనరసయ్య ఆధ్వర్యంలో మహిళ ప్రతినిధులు శోభారాణి, ముడుపు సరిత, వజిన పల్లి శైలజ, బోనగిరి జ్యోతి లను శాలువాలతో సత్కరించారు. జూట్ బ్యాగులను పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధ్యం కావాలంటే సొంతంగా నిర్ణయాలు తీసుకుని ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. ప్రతీ మహిళా చదువుకొని తన కాళ్ల మీద తాను నిలబడాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యం సాధ్యమవుతుందని వివరించారు. మహిళలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ దామెర సరేష్, రేవంత్ వెంకటేశ్వర్లు, సెక్రెటరీ ముడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్ లు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట

### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### బూరుగుపల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### గంజి వాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



బోయినపల్లి మార్చి 11 (వాయిస్ టుడే ప్రతినిధి) : మహిళ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రం లో 20 లక్షలతో రెండు మహిళా సమైక్య సంఘం భవనాల నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అలాగే బూరుగుపల్లి లో ఐదు లక్షల రూపాయలతో నిర్మించబోయే సిసి రోడ్డుకు స్థాపన చేశారు.స్తంభం పల్లి గంజి వాగు వద్ద నిర్మిస్తున్న హై లెవెల్ వంతెనను పరిశీలించారు. బోయినపల్లి మండల కేంద్రంలో మహిళలు మంగళ హారతులతో , పూలు చల్లుతూ స్వాగతం పలికారు.

అనంతరం ఏం ఎల్ ఏ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. మహిళలు సాధికారత సాధించే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా.. ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని అందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించారని తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మహిళా తల్లులను లక్ష అధికారులు చేయాలని పావలా వడ్డీ రుణాలు అందించి మహిళా సంఘాలకు బలమైన ఊతమిచ్చారని గుర్తు చేశారు. మహిళలను లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోకుండా, సభ్యులను కేవలం సమావేశాలకు మాత్రమే పరిమితం చేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటి వరకు మూడు సార్లు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.అనంతరం కొదురుపాక చెందిన వికలాంగుడు దేవరాజు కు ఎమ్మెల్యే చేతుల మీదుగా స్కూటీ నీ అందజేశారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ డి వో మచ్చ గీత,ఏ ఏం సి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,సర్పంచ్ నల్ల మోహన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి,ఉప సర్పంచ్ మెరుపుల చందన,ఏ ఏ సి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు జలజ,ఏపీఎం పవన్,వ్యవసాయ అధికారి ప్రణీత, ఆయా గ్రామాల సర్పంచులు ఏనుగుల కనకయ్య, చల్ల శ్రీనివాస్ రెడ్డి కౌడ గాని వెంకటేష్,నాయకులు నాగుల వంశీ,సంబ లక్ష్మీ రాజం కోమ్మన బోయిన సువిన్ యాదవ్,మెరుపుల జలంధర్, గుంటి జలంధర్,మహిళా సంఘాల ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## కంకర తేలిన రోడ్డుతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

### ముదిమాణిక్యం -- గునుకులపల్లె మధ్య నరకయాతనగా మారిన రహదారి

### తక్షణమే తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి జేరిపోతుల రాజు విజ్ఞప్తి



చిగురుమామిడి, మార్చి 11 (వాయిస్ టుడే): మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అరకాలపల్లె మీదుగా గునుకులపల్లె గ్రామ ప్రధాన రహదారికి వెళ్లే దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న తారు రహదారి తీవ్రంగా దెబ్బతిని ప్రయాణికులకు నరకయాతనగా మారింది. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారిపై తారు పూర్తిగా తొలగిపోయి కంకర తేలిపోవడంతో పాటు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు ఈ మార్గంలో ప్రయాణించే గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కంకర, గుంతల మధ్య ప్రయాణం చేయాల్సి రావడంతో పలుమార్లు అదుపుతప్పి కిందపడిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి దుస్థితి కారణంగా వాహనాలు కూడా తరచూ చెడిపోతున్నాయని సామాజిక సేవకుడు జేరిపోతుల రాజు (జెపిఆర్), ముంజ వెంకన్న, బోయిని బిక్షపతిలు తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో రహదారిపై ఉన్న కంకర రాళ్లు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం అధికంగా ఉందని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా వాహనాలు వెళ్లినప్పుడల్లా కంకర రోడ్లపై నుండి దుమ్ము ధూళి ఎగసిపడి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నదని చెప్పారు. ఈ రహదారిని ఉపయోగించే అనేక గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వెంటనే స్పందించి తారు రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి రహదారిని పునర్నిర్మించాలని సామాజిక సేవకుడు జేరిపోతుల రాజు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉన్నందున అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలావుండగా, ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండి నెమ్మదిగా ప్రయాణించాలని జేరిపోతుల రాజు సూచించారు.



## అంబేద్కర్ నగర్ పాఠశాలలో ఘనంగా స్వయంపరిపాలన

తొర్రూరు, మార్చి 11 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రశీ అంబేద్కర్ నగర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు స్వాతి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే పిల్లల్లో నాయకత్వ లక్షణాలతో పాటుగా,సృజనాత్మకత, ఒక పనిపట్ల బాధ్యత, అంకితభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయనీ, భావించి ఉపాధ్యాయులందరశీ విద్యార్థినీ,విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓగా మోహన్ నాథ్, ప్రధానోపాధ్యాయునిగా అభినయ్ తో పాటు,తెలుగు ఉపాధ్యాయులుగా రాహూల్, రాజ్ కమల్ కుమార్, తనూజ, ఆంగ్ల ఉపాధ్యాయులుగా రిషిక, సందేశ్,అక్షణ,నిఖిల్, గణిత ఉపాధ్యాయులుగా మహేష్,గణేష్,నిఖిల్ పరిసరాల విజ్ఞానం ఉపాధ్యాయులుగా దైవిక్, సాగర్,శ్రేయసి,క్రీడల ఉపాధ్యాయునిగా ఋత్విక్‌తో పాటు,స్కావెంజర్ గా రాజేశ్వరి తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరిత, సునిత, సంధ్యారాణి, ప్రవీణ్ కుమార్,శిరీష,యమున, సతీష్ తదితరులతో పాటుగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చైతన్య కళ సమాఖ్య కృషి పట్టుదల ప్రశంసనీయం

### ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్రావు



తొర్రూరు, మార్చి 11 వాయిస్ టుడే : మహబూబాబాద్ జిల్లాలో ముఖ్య పట్టణమైన తొర్రూర్ లో 40 సంవత్సరాలుగా కళాసేవ చేస్తూ 14వ జాతీయ తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్రావు అన్నారు. మంగళవారం రాత్రి రెండో రోజున ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభించారు అనంతరం ఎమ్మెల్సీ రవీందర్రావు భావోద్వేగంతో మాట్లాడుతూ చిన్న పట్టణంగా ఉన్న తొర్రూర్ లో నాటిక పోటీలు నిర్వహించడం తనలో కసి రేకెత్తించిందని తాను కూడా కళాకారులను ప్రోత్సహించాలని సదుద్దేశంతో విజ్ఞాన భారతి కళా సమితిని నెలకొల్పి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జానపద కళాకారులను ఆహ్వానించి పోటీలు నిర్వహించానని అన్నారు. అందులో ఉన్న కష్టసుఖాలను అనుభవంలోకి తీసుకొని అదే మొదటి అదే చివరి కార్యక్రమం అని చెప్పారు. కానీ తొర్రూర్ లో ఉన్న చైతన్య కళా సమాఖ్య సభ్యులు ఐక్యంగా కళామ తల్లిని సేవ తరించి పునీతులు అవుతున్నారని, కళాకారులను నాటక కళ ను రక్షించే ప్రయత్నం గా మనసుపెట్టి బరువు, బాధ్యతలను మోస్తూ నాటిక కళ ను బతికిస్తున్న చైతన్య కళా సమాఖ్య కృషి, మీ త్యాగం ,సేవలకు సంఘీభావం తెలుపుతున్నని సమాఖ్య సేవలను కొనియాడుతూ ప్రశంసించారు. ఏ కార్యక్రమానికి అయినా దాతలు ముందుకు వస్తారని శాశ్వతంగా ఇచ్చే వాళ్ళు కూడా ఉంటారని కానీ తొర్రూర్లో చైతన్య కళా సమైక్య శాశ్వత ప్రేక్షకులు కు ఉండటం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. ప్రేక్షకులు ఆదరిస్తున్నందువల్లనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయని అన్నారు కోట్లు ఖర్చుపెట్టినా ఖర్చు చేస్తున్న పలు సంఘాల ఆహ్వాన పత్రికలకు మిన్నగా చైతన్య కళా సమాఖ్య రూపొందించిన ఆహ్వాన పత్రికను తాను ఎక్కడ చూడలేదని ఆహ్వాన పత్రికను చూడగానే తన కళ్ళు చెమ్మగిల్లాయని ,కార్డు కన్నా మిన్నగా కార్యక్రమాలను అకుంఠిత భావం నిర్వహించడం ఎంతో గొప్పదని కళ శాశ్వతం మీరు చేస్తున్న సేవలు అజారామారమని చెప్పారు. నాటికకు పారితోషిక దాతగా విచ్చేసిన మహబూబాబాద్ కౌన్సిలర్ ముత్యం వెంకన్న గౌడ్ మాట్లాడుతూ తొర్రూరుకు నాకు ఎంతో కాలంగా పరిచయాలు సంబంధాలు ఉన్నాయని తాను కూడా ఒక కళాకారుడిని చిన్న వయసులోనే నాటికలు రూపొందించినదని ఇప్పటికి కూడా నాటక కళను అభిమానిస్తానని తొర్రూర్ మిత్రులు అడగడంతోనే తాను నాటిక పోటీలకు రావడం జరిగిందని ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ , మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి, వహించగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రవీందర్రావు మహబూబాబాద్ కౌన్సిలర్ ముఖ్య వెంకన్న గౌడ్ తొరూరు ఉద్యమ జేఏసీ కన్వీనర్ కల్వకొలను ప్రవీణ్ రాజు అసోసియేట్ ప్రెసిడెంట్ మంగళపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పినాకపాణి, కోశాధికారి గడల శ్రీనివాస్, సమాఖ్య కార్యదర్శి లేగల వెంకటరెడ్డి, ఇతర బాధ్యులు జనార్దన్ రాజు, పట్నం శెట్టి శ్రీశైలం ఇమ్మడి రాంబాబు, భాస్కరాచారి లక్కీ డీప్ ప్రోత్సాహకులు వజినపెల్లి వినయ్ మౌనిక పాల్గొన్నారు.

